



తెలంగాణ గడ్డ ఎంత అదృష్టం చేసుకున్నది!
ఇక్కడ కాటన్ పుట్టకపోయినా నష్టంలేదు. కేసీఆర్ జన్మించారు.
మనకు బోర్లాగ్ లేకపోయినా బాధ లేదు. కేసీఆర్ ఉన్నారు.
చిప్కో ఉద్యమంలో పాల్గొనలేదని చింత ఎందుకు?
కేసీఆర్ హరితహారంలో మొక్కలు నాటాం కదా!
పటేల్ సాబ్ ఉక్కుమనిషి అయితే కావచ్చు.
మన కేసీఆర్.. తెలంగాణ బంగారం.
కల్వకుంట్ల చంద్రశేఖర రావు
దశాబ్ద పాలనకు కొలమానం లేదు.
ఏడుపదుల వ్యక్తిత్వానికి ఉపమానం లేదు.
కానీ, ప్రపంచ ఉద్యమాల్ని అధ్యయనం చేసినప్పుడు,
విశ్వ దార్శనికుల్ని అర్థం చేసుకుంటున్నప్పుడు
కేసీఆర్ తప్పక గుర్తుకొస్తారు.
ఇది పోలిక కాదు.
ఒక ఏలిక ప్రతిభకు మచ్చుతునక.

# పచ్చనాకు సాక్షిగా

## కేసీఆర్.. హరితహారం

పర్యావరణ సమతౌల్యానికి, స్వచ్ఛమైన గాలికి, పుష్కలమైన నీటికి.. పచ్చదనమే పరిష్కారమని భావించారు కేసీఆర్. ఆ సులక్ష్యంతోనే మొక్కల పెంపకాన్ని మొక్కవోని దీక్షతో చేపట్టారు. 'హరితహారం' పేరుతో బృహత్తర కార్యక్రమాన్ని ఆరంభించారు. తొమ్మిదేండ్ల వ్యవధిలో 283.71 కోట్ల మొక్కలు నాటించారు. నాటిన ప్రతి మొక్కనూ కంటికి రెప్పలా సంరక్షించారు. వృక్షం మనిషికి ప్రాణభిక్షం. భూమికి పోషకాలను అందిస్తుంది. వరదలను నివారిస్తుంది. సకాలంలో వానలు కురిపిస్తుంది. కాబట్టే, ఒక మొక్కను నాటితే రూ. 74,500 సంపదను సృష్టించినట్టే అంటారు నిపుణులు. అంటే, తొమ్మిదేండ్ల వ్యవధిలో 283.71 కోట్ల మొక్కలను నాటించడం ద్వారా.. రూ. 211 లక్షల కోట్ల సంపదను జాతికి అందించారు కేసీఆర్.





## సుందర్‌లాల్ బహుగుణ-చిప్కో ఉద్యమం

హిమాలయాల్లో అడవుల వినాశనానికి వ్యతిరేకంగా ప్రముఖ పర్యావరణవేత్త సుందర్‌లాల్ బహుగుణ చిప్కో (చెట్లను హత్తుకోవడం) ఉద్యమాన్ని ప్రారంభించారు. చెట్ల ప్రాధాన్యాన్ని, పర్యావరణ పరిరక్షణలో వాటి పాత్రను ప్రజలకు, ప్రభుత్వాలకు తెలియజెప్పారు. బహుగుణ బహుముఖ పోరాటం ఫలించింది. పచ్చని చెట్ల నరికివేతపై నాటి సర్కారు పదిహేనేండ్ల నిషేధం విధించింది. ఆయన పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలకు గుర్తుగా భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మ విభూషణ్ పురస్కారంతో సుందర్‌లాల్ బహుగుణను సత్కరించింది. అంతర్జాతీయ సంస్థలు సైతం చిప్కో ఉద్యమాన్ని మెచ్చుకున్నాయి. వివిధ ఎన్జీవోలు, ప్రభుత్వాల ఆహ్వానం మేరకు బహుగుణ పందొమ్మిది దేశాల్లో పర్యటించారు. స్విట్జర్లాండ్ ఆయనను పర్యావరణ సలహాదారుగా నియమించాలని నిర్ణయించింది.